


అదొక ఆశ్రమ పాఠశాల. ఆ ప్రాంగణమంతా వేద మంత్రాలతో మార్మోగుతుంటుంది. వేదానికి నాదాన్ని జతచేస్తూ వాద్యఘోష వినిపిస్తుంది. బ్రహ్మ తేజస్సుతో వెలిగిపోతున్న పిల్లలు.. సాయంత్రాలు ముల్లుగర్రలు చేతబూని 'సై' అంటూ పోరాటాలు చేస్తుంటారు. వేద విద్యకు అనుబంధంగా లెక్కలతో దోస్తీ చేస్తారు. సైన్స్ ప్రయోగాలు శ్రద్ధగా నేర్చుకుంటారు. ఆంగ్లంలో అనర్గళంగా ప్రసంగిస్తారు. ఆశ్రమ విద్యా విధానంలో చతుర్వేదాలను అభ్యసిస్తూనే.. సాధారణ పాఠాలనూ ఆపోశన పడుతుంటారు. భిన్నమైన విద్యాలక్ష్యాలు కలిగిన పాఠశాల విద్యారణ్యమ్. ఇక్కడ చదువుకుంటున్న పిల్లలకు మార్గదర్శకులు తప్ప సేవకులు ఉండరు. ఎదిగే వయసులో బౌద్ధిక వికాసాన్నేకాదు తమకాళ్లపై తాము నిలబడేలా పిల్లల్ని తీర్చిదిద్దుతున్నారు ఇక్కడి గురువులు. విద్యారణ్యమ్‌లో బోధన, నిర్వహణ, పాఠ్యాంశాలు అన్నీ ప్రత్యేకమే!

# ఇక్కడ వేదం.. జీవన నాదం





ఏ పాఠశాలకు వెళ్లినా కార్యాలయంలో అడుగుపెట్టగానే ఉపాధ్యాయుడో, ఉద్యోగో పలకరిస్తాడు. వచ్చిన పని మాట్లాడేందుకు ప్రిన్సిపాల్ దగ్గరకు పంపిస్తాడు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామంలోని విద్యారణ్యమ్ అందుకు భిన్నంగా ఉంటుంది. ఎవరైనా 'ఇక్కడ మా పిల్లల్ని చదివించాలి' అని అడుగుపెట్టిన వాళ్లకు నమస్కరిస్తూ 'స్వాగత్ ప్రముఖ్' పలకరిస్తాడు. ఇతను పాఠశాలలోని వేద విద్యార్థే. పిల్లలే దీని నిర్వాహకులు. ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యత ఉంటుంది. వచ్చిన వాళ్లతో వ్యవహారాలు నడపడానికి స్వాగత్ ప్రముఖ్ ఉన్నట్టే, ప్రతి పనికీ ఓ ప్రముఖ్ ఉంటాడు. ఆయనకు ఇద్దరు సహ ప్రముఖ్‌లు చేదోడు వాదోడుగా ఉంటారు. వీళ్లు తమకు కేటాయించిన పనిని పర్యవేక్షిస్తారు. కార్యనిర్వహణకు 'టోరి'అనే నలుగురు సభ్యులు ఉంటారు. ఆశ్రమంలోని విద్యార్థులందరినీ పర్యవేక్షక్ ఉదయం నాలుగు గంటలకు నిద్ర లేపుతాడు. ఆ తర్వాత అందరూ కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసేలా శుచి ప్రముఖ్ బాధ్యత తీసుకుంటాడు. విద్యారణ్యమ్ నిర్వహణ కోసం వ్యవస్థ ప్రముఖ్ ఉంటాడు. తన సహ ప్రముఖ్‌లు, టోరీలతో కలిసి ఏ రోజు విద్యార్థులు ఏం చేయాలి? ఏ బృందం ఎక్కడ కూర్చోవాలో ప్రణాళిక రూపొందిస్తారు. ఆ ప్రణాళిక ప్రకారం విద్యార్థులు వేదాధ్యయనం, శాస్త్ర అధ్యయనం, సంగీత సాధన, వ్యాయామ విద్యలు సాధన చేస్తారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని ఇలా స్వయం పాలన విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులెవరూ టీవీ చూసే అవకాశం లేదు. ఫోన్లు వాళ్లకు అందుబాటులో ఉండవు. సమయసారిణిని బట్టి వేద సాధన, శాస్త్ర సాధన చేస్తూ బౌద్ధిక వికాసం కోసం జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

### సామవేద సారం

ప్రతి తరగతిలో పదిహేను మంది విద్యార్థులు ఉంటారు. ధోవతి కట్టుకుని, బాసింపట్టు వేసుకున్న విద్యార్థులు శ్రావ్యంగా వేదాన్ని పఠిస్తుంటారు. వేద పఠనంలో శ్రుతి ప్రధానమైనది. ఈ శ్రావ్య